సంక్షోభంలో స్టడీ టూర్లా..!

కార్పొరేటర్లకు బల్దియా ఆర్థిక బాధలు పట్టవా?

- వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు మూడు విడతల్లో ప్లాన్
- ఒక్కో ఫేజ్‌లో 50 మంది వంతున కార్పొరేటర్లు
- ఢిల్లీ, ఆగ్రా, జైపూర్, ఇండోర్, లక్నో, అసోం గౌహతి నగరాలకు పర్యటన ప్రణాళిక
- స్టడీ టూర్‌కు స్టాండింగ్ కమిటీ ఆమోదం

రూ.1.25 కోట్ల ప్రజాధనం వృథా తప్ప స్టడీ టూర్లతో ఒరిగేదేమీ లేదంటున్న కార్మిక సంఘాలు

సిటీబ్యూరో, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్న దరిమిలా..కార్పొరేటర్లు స్టడీ టూర్లకు సిద్ధం కావడం విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఖజానాలో నిధుల్లేక నెలవారీగా సిబ్బంది జీతాల చెల్లింపులకే కనాకష్టంగా మారిన తరుణంలో ఇతర నగరాల బాట పట్టేందుకు కార్పొరేటర్లు సన్నద్ధమయ్యారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు మొత్తం 150 మంది ఒకేసారి కాకుండా ట్రిప్పులో 50 మంది చొప్పున మూడు విడతలుగా మూడు ప్యాకేజీల్లో ఆయా నగరాలను చుట్టి వచ్చేందుకు టూర్ సిద్ధం చేశారు. ఇందుకు దాదాపు రూ.1.25 కోట్ల ప్రజాధనం ఖర్చు చేసేందుకు ప్రణాళిక రచించారు. ఈ మేరకు ట్రావెల్స్ ఏజెన్సీల నుంచి కొటేషన్లు ఆహ్వానించుటకు గురువారం స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. మూడు విడతల్లో ఒక్కో విడతకు 50 మంది చొప్పున స్టడీ టూర్‌కు వెళ్లేందుకు మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు.

ఆర్థిక బాధలు పట్టవా?

కాంట్రాక్టర్లకు రూ.1500 కోట్ల బకాయిలు ఒక వైపు.., ఆదాయం లేక సిబ్బంది జీతాల చెల్లింపులు, నిర్వహణ పనులకు నిధుల్లేక ప్రాజెక్టులు ఢీలా పడిన పరిస్థితి. మరోవైపు అధ్వాన్నపు పారిశుద్ధ్యం, దోమలు, డెంగీ, మలేరియా కేసులు, కుక్కల కాట్లు, ట్రాఫిక్ జామ్‌లతో ప్రజలు అల్లాడిపోతున్నారు. చిన్నపాటి వర్షానికే గ్రేటర్ ప్రజానీకం ఉక్కిరిబిక్కిరవుతుంది. ఇటువంటి తరుణంలో ఆదాయ వనరులను సమకూర్చడంతో పాటు వచ్చిన ఆదాయంతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి, పౌర సేవల నిర్వహణను చేపట్టాల్సిన కార్పొరేటర్లు ఖాజానాలో చిల్లి గవ్వ లేనప్పుడు స్టడీ టూర్లకు వెళ్లడం ఎంత వరకు సమంజసం? అని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఇలాంటి ప్రయత్నాలు, గొంతెమ్మ కోర్కెలు కార్పొరేషన్ మనుగడను ప్రశ్నార్థకం చేసే ప్రయత్నాలేనన్న విమర్శలు సైతం లేకపోలేదు.

స్టడీ టూర్లతో ఒరిగేదేమిటీ?

స్టడీ టూర్లతో దుబారా తప్ప ఒరిగేదేమీ లేదన్న చర్చ జరుగుతున్నది. ఐతే, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు స్టడీ టూర్ల పేరిట విహార యాత్రలు చేయడం కొత్తేమీ కాదు. పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్ రోడ్ పనులు, ఇతరత్రా అంశాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసేందుకని చెబుతున్నారు. ఐతే దేశంలోని పలు నగరాల నుంచి మేయర్లు, కార్పొరేటర్లు, అధికారులు జీహెచ్‌ఎంసీలోని బెస్ట్ ప్రాక్టీసెస్‌ను అధ్యయనం చేయడానికి వస్తుండగా, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు ఇతర నగరాలకు వెళ్లడం నిధుల దుబారా తప్ప మరొకటి కాదని జీహెచ్‌ఎంసీ వర్గాలే అంటున్నాయి.

టూర్లు ఇలా...

ఫేజ్-1:- ఢిల్లీ, ఆగ్రా, జైపూర్
ఫేజ్ 2:- ఇండోర్, లక్నో
ఫేజ్ 3:- అసోం గౌహతి

- వచ్చే నెల 1వ తేదీ నుంచి 30వ తేదీలోగా ఒక్కో ఫేజ్‌లోని నగరాలకు 50 మంది వంతున కార్పొరేటర్లు వెళ్లనున్నారు. ఒక్కో బృందం వెంట కో ఆర్డినేటర్‌గా అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారి వెళ్లనున్నారు.

రెండు రోజుల వర్ష సూచన

సిటీబ్యూరో, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ): ఆవర్తన ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు. ఇదిలా ఉండగా, గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 30.5 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 23.5 డిగ్రీలు, గాలిలో తేమ 69 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

మేయర్‌కు ఔట్ సోర్సింగ్ సన్మానం

సిటీబ్యూరో, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ డిమాండ్లను నెరవేర్చిన మేయర్ గద్వాల విజయలక్ష్మికి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ సభ్యులు గురువారం ఘనంగా సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

తాను మరణిస్తూ..

గుజ్జుల విశ్వతేజ్ (ఫైల్)

ఖైరతాబాద్, ఆగస్టు 22: తాను మరణించినా మరొకరి అవయవ దానం ద్వారా కొత్త జీవితాన్ని అందించాడు ఓ బాలుడు. మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల మండలం వెంకటేశ్వర కాలనీకి చెందిన గుజ్జుల విజయ్ కుమార్, కుమారి దంపతుల కొడుకు విశ్వతేజ్ (17) ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. ఈ నెల 17న తన సోదరుడితో కలిసి బైకుపై వెళ్తుండగా, కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విశ్వతేజ్‌ను చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 21న బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా, అందుకు అంగీకరించారు. ఆయన శరీరం నుంచి కాలేయాన్ని సేకరించారు.

రద్దయిన చట్టం కింద హక్కులు కోరలేరు

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) చట్టం 2008లో రద్దయిందని, ఆ చట్టం కింద ప్రభుత్వం భూమిపై హక్కులు కోరడానికి వీల్లేదని హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. దివాలా తీసిన కంపెనీకి చెందిన భూమిని కోర్టు నియమించిన లిక్విడేటర్ నిర్వహించిన వేలంలో కొనుగోలు చేసి, దానికి భూమార్పిడి అనుమతులు తీసుకున్నాక యూఎల్‌సీగా పేర్కొంటూ భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వకపోవడం సబబు కాదని జీహెచ్‌ఎంసీకి తేల్చి చెప్పింది. గతంలో సింగిల్ జడ్జి వెలువరించిన తీర్పును రద్దు చేయాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం కొట్టివేస్తూ ఇటీవల తీర్పు చెప్పింది.

హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ దేవేందర్ సింగ్ శ్యామ్, మేనేజింగ్ డైరెక్టర్ శర్వన్ కుమార్‌లకు పుష్పగుచ్ఛం అందించి సన్మానం చేస్తున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

టెస్కాబ్‌ను సందర్శించిన హిమాచల్ ప్రదేశ్ కోఆప్ సిబ్బంది

సుల్తాన్ బజార్, ఆగస్టు 22: తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ కార్యాలయాన్ని హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంక్ సిబ్బంది సందర్శించారు. ఈ మేరకు గురువారం కోఠిలోని టెస్కాబ్ ప్రధాన కార్యాలయానికి విచ్చేసిన హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ దేవేందర్ సింగ్ శ్యామ్, మేనేజింగ్ డైరెక్టర్ శర్వన్ కుమార్‌లు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టెస్కాబ్ బ్యాంక్‌లో జరుగుతున్న ప్రధాన ఆర్థిక వివరాలు, టర్నోవర్, బ్యాంక్ పురోగతి, ఐటీ రంగంపై, అంతే కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ గురించి హిమాచల్ ప్రదేశ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ బృందానికి టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు వివరించారు. అనంతరం, వారిని ఆయన పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కార్యక్రమంలో టెస్కాబ్ సీజీఎం జ్యోతి, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ సిబ్బంది సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డా. రాజారావుకు అరుదైన గౌరవం

కరోనా సమయంలో అందించిన సేవలను గుర్తించిన ఐసీఎంఆర్

సిటీబ్యూరో, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ): కరోనా విపత్కర సమయంలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి వేల మంది ప్రాణాలు కాపాడిన గాంధీ దవాఖాన మాజీ సూపరింటెండెంట్ డా.రాజారావు, డా.త్రిలోక్‌లకు ప్రత్యేక గౌరవం దక్కింది. వారి సేవలను గుర్తించిన ఐసీఎంఆర్ వారికి ప్రసంశా పత్రాలను ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఢిల్లీలో నిర్వహించిన సన్మాన సభ కార్యక్రమంలో గాంధీ దవాఖాన మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, డాక్టర్ త్రిలోక్‌లు ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ రాజీవ్‌బేల్, నీతి అయోగ్ డైరెక్టర్ వినోద్‌పాల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. దేశ వ్యాప్తంగా మొత్తం 42 కరోనా నోడల్ సెంటర్లను నిర్వహించగా, ఆయా నోడల్ కేంద్రాల్లో ఉత్తమ సేవలందించిన వైద్యులను గుర్తించిన ఐసీఎంఆర్ వారిని ప్రశంసాపత్రాలు అందచేసి ఘనంగా సన్మానించింది.

జల మండలి ఎండీని కలిసిన కామ్‌గార్

సిటీబ్యూరో, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ): జలమండలి కామ్‌గార్ యూనియన్ ప్రెసిడెంట్ మొగుళ్ల రాజిరెడ్డి గురువారం తన కార్యవర్గంలో ఎండీ అశోక్ రెడ్డిని ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో పెండింగులో ఉన్న జూనియర్ అసిస్టెంట్ ట్రాన్స్‌ఫర్స్,, జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్ల పదోన్నతులు, జల మండలి ఉద్యోగులందరికీ ఈహెచ్‌ఎస్, ప్రభుత్వ హెల్త్ కార్డులు ఇప్పించేందుకు ఏర్పాట్లు చేయాలని తదితర సమస్యలను ఎండీ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం, ఈడీ మయాంక్ మిట్టల్‌ను కలిసి ఉద్యోగ, కార్మిక సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో కామ్‌గార్ యూనియన్ నాయకులు సురేశ్ బాబు, భూమన్న, రామరాజు, రఘునాథ్, బీఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు బీఈఎల్ రూ.25 లక్షల ఆర్థిక సాయం

సిటీబ్యూరో, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ): ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెక్టార్‌లో బొనంద ఇంజినీరింగ్ లిమిటెడ్ (బీఈఎల్) గొప్ప విజయాన్ని సాధించిందని సంస్థ సీఎండీ డాక్టర్ రాఘవేంద్ర రావు తెలిపారు. 2012లో కంపెనీ ప్రారంభించామని, నిర్ణీత సమయం, బడ్జెట్ లోపు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు. సీఎస్‌ఆర్‌లో భాగంగా కంపెనీ అనేక కార్యక్రమాలు తీసుకుందని చెప్పారు. అందులో భాగంగా కేరళలోని వయనాడ్‌లో జరిగిన విపత్తు దృష్ట్యా రూ.25 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ కింద అందజేసినట్టు పేర్కొన్నారు.

తమిళనాడులో రామరాజు కాటన్ యూనిట్స్..

సిటీబ్యూరో, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ): చెన్నైలోని లీల ప్యాలెస్‌లో గురువారం తమిళనాడు ముఖ్యమంత్రి కె.స్టాలిన్ రామరాజ్ కాటన్ ఇండస్ట్రియల్ యూనిట్స్‌ను ప్రారంభించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఇడువంపాలయం, తిరుపూర్‌లో దీనిని ప్రారంభించారు. జనవరిలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమావేశంలో తమిళనాడు ప్రభుత్వంతో రామరాజ్ కాటన్ కంపెనీ రూ.1000 కోట్లతో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా కంపెనీ చైర్మన్ నాగరాజన్ మాట్లాడుతూ, ఇండస్ట్రియల్ యూనిట్ స్థాపనతో రెండు వేల ప్రత్యక్ష, ఐదువేల పరోక్ష ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు.

ప్రతి స్పందనను రేకెత్తించేవి చిత్రాలే..

టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

ఛాయా చిత్రాలను తిలకిస్తున్న వీసీ సజ్జనార్

రవీంద్రభారతి, ఆగస్టు 22: చరిత్రలో, మన జీవితంలో కూడా ముఖ్యమైన క్షణాలను వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు చాలా తరచుగా ప్రతిస్పందనను రేకెత్తించివి చిత్రాలే.. అని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన 2024ను వీసీ సజ్జనార్ గురువారం తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ఛాయాచిత్ర ప్రదర్శన ద్వారా ప్రపంచానికి బలమైన సందేశాన్ని పంపించడానికి రాష్ట్రానికి చెందిన ఫొటో జర్నలిస్టులు చేసిన ఈ సృజనాత్మక పనికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫొటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనుమళ్ల గంగాధర్, ఉపాధ్యక్షుడు టి.కిషోర్‌సింగ్, పి.రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి ఏఎన్.హరి, కోశాధికారి అనిల్ కుమార్ కర్ణకోటి, ఎండి అలీముద్దీన్, గోపాల్, మహేష్ కుమార్, పి.సురేంద్ర, ఎల్లేశా, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆయుర్వేదిక్ వైద్యంతో కిడ్నీలకు మేలు

సిటీబ్యూరో, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ): కిడ్నీలకు ఆయుర్వేదిక్ మెడిసిన్ చాలా ప్రమాదకరమని దేశంలో తప్పుడు సమాచారం ప్రచారంలో ఉందని ఆచార్య బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కిడ్నీ వ్యాధులను నయం చేయడమే కాదు, పాడైన కిడ్నీలను సైతం బాగు చేసేలా ఆయుర్వేదిక్ మెడిసిన్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ మేరకు అమెరికన్ రీసెర్చ్ జర్నల్ సైంటిఫిక్ రిపోర్ట్‌లో వివరాలు ఉన్నాయని వివరించారు.

గృహ హింస బాధితుల శ్రేయస్సుకు రాహత్ కృషి

- భారత బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ క్రిస్టీనా స్కాట్
- రాహత్ క్రైసిస్ సెంటర్ ప్రారంభం

ఫెర్నాండెజ్ హాస్పిటల్‌లో రాహత్ క్రైసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న భారత బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ క్రిస్టీనా, తెలంగాణ- ఏపీ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెస్, ఫౌండేషన్ చైర్‌పర్సన్, ఎండీ డా. ఎవిటా ఫెర్నాండెజ్‌లు

సుల్తాన్ బజార్, ఆగస్టు 22: మహిళలు, బాలికలకు మద్దతు ఇవ్వడం యూకే అంతర్జాతీయ పనిలో ప్రధానమైనదని భారతదేశ బ్రిటీష్ డిప్యూటీ హై కమిషన ర్ క్రిస్టీనా స్కాట్ అన్నారు. ఈ మేరకు గురువారం బొగ్గుల కుంటలోని ఫెర్నాండెజ్ హాస్పిటల్‌లో ఫెర్నాండెజ్ ఫౌండేషన్, ఇన్విజిబుల్ స్కార్స్ ఫౌండేషన్‌తో కలిసి రాహత్ క్రైసిస్ సెంటర్‌ను ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి తెలంగాణ – ఏపీ బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెస్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్ పర్సన్, ఎండీ డాక్టర్ ఏవిటా ఫెర్నాండెజ్‌లతో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం, ఆమె మాట్లాడుతూ, లింగ సమానత్వం కోసం మా దృష్టి 3ఈ సూత్రంగా మార్గనిర్దేశనం చేయబడిందన్నారు. బాలికలకు విద్యను అందించడం, మహిళలకు, బాలికలకు సాధికారత కల్పించడంతో పాటు లింగ ఆధారిత హింసను అంతం చేయడమే ఈ సెంటర్ లక్ష్యమన్నారు. గృహ హింస నుంచి బయటపడిన వారి శ్రేయస్సు కోసం అవసరమైన సహాయాన్ని ఈ కేంద్రం ద్వారా సురక్షితంగా అందించడంతో పాటు పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడంలో సహాయపడుతుందని అన్నారు. ఫెర్నాండెజ్ హాస్పిటల్ సీనియర్ ప్రసూతి వైద్యులు డాక్టర్ మైమూనా అహ్మద్ మాట్లాడుతూ, గృహ హింస వలయంలో చిక్కుకున్న మహిళలను ఆదుకోవడమే లక్ష్యంగా హాస్పిటల్‌లో రాహత్ క్రైసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఇన్విజిబుల్ స్కార్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఏక్తా వివేక్ వర్మ మాట్లాడుతూ గృహ హింసను గుర్తించడానికి, తక్షణమే ప్రతిస్పందించడానికి ఫెర్నాండెజ్ హాస్పిటల్ సిబ్బందికి శిక్షణ అందిస్తున్నట్లు ఆయన వివరించారు. గృహ హింస నుంచి బయటపడిన వారికి సాంత్వనతో అవసరమైన వనరులను అందిస్తామన్నారు.

ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలి

సీపీఐ(ఎం-ఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో పలువురు వక్తలు

ర్యాలీలో సీపీఐ(ఎం-ఎల్) మాస్‌లైన్ పార్టీ నాయకులు, రైతులు, ప్రజలు

చిక్కడపల్లి, ఆగస్టు 22: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, రైతులకు ప్రకటించిన రుణమాఫీని అర్హులైన వారందరికి అమలుచేయాలని, రైతు భరోసాకు నిధులు విడుదల చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం-ఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. అనంతరం, ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాస్వామికవాది ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో దేశంలో ప్రజాస్వామిక విలువలు ఉండాలన్నారు. ప్రజల కోరికలు ప్రభుత్వాలు నెరవేర్చాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. అనేక వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ముందు పెట్టి అధికారంలోకి వచ్చిందని, ఆ వాగ్దానాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సీపీఐ(ఎం-ఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిందన్నారు. తొమ్మిది నెలలు కావొస్తున్నా మహిళలకు ఒక్క ఆర్టీసీ బస్సు ఉచితం తప్ప వేటిని అమలు చేయలేదని మండిపడ్డారు. రైతు పంటలకు గిట్టుబాటు ధర కాకుండా బోనస్‌గా ఇస్తామన్న రూపాయిలు నేటికీ ఇవ్వలేదని, గిట్టుబాటు ధర లేక రైతులు సతమతవుతన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి కేవలం 40 శాతం మాత్రమే చేయడం దేనికి నిదర్శనం అని ప్రశ్నించారు. విద్యార్థులకు ఫీజు రియంబర్‌మెంట్ చేయకపోవడం మూలంగా ఉన్న విద్య పేద, మధ్యతరగతి కుటుంబాలకు దక్కడం లేదని వివరించారు. నిరుద్యోగ భృతి ఇస్తామని, జాబ్ క్యాలెండర్‌ని ప్రకటిస్తూ ఒక్క ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పార్టీ సెక్రటేరియట్ సభ్యులు కె.రామచందర్, కె.రమ, గుమ్మడి నర్సయ్య, నాయకులు జి.వెంకటేశ్వర రావు, వి.కృష్ణ, వి.ప్రభాకర్, చన్ని చంద్రన్న, కె.సూర్యం, చంద్ర అరుణ, కృష్ణ, ఎం.హన్మేష్, ఎస్.ఎల్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో గురువారం ఈడీ ఆఫీస్ వద్ద కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించింది. ఈ కారణంగా లక్డీకాపూల్, అసెంబ్లీ – గన్‌పార్క్, నాంపల్లి, బషీర్‌బాగ్, ట్యాంక్‌బండ్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. వందల వేల వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ మూలంగా గంటల తరబడి నిలిచిన ట్రాఫిక్‌కు ప్రజలు చికాకు పడి, పార్టీ తీరు, అధికార యంత్రాంగం పోకడలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రూ.1450తో మెట్రో డీలక్స్ మంత్లీ బస్సు పాస్: గ్రేటర్ జోన్ ఈడీ

సిటీబ్యూరో, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ): మెట్రో డీలక్స్ మంత్లీ బస్సు పాస్‌ను మరోసారి అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు గురువారం పేర్కొన్నారు. నెల వారి పాస్‌కు రూ.1450 ధర ఉంటుందని చెప్పారు. ఈ బస్సు పాస్‌తో మెట్రో డీలక్స్, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ మెట్రో ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీ, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ప్రయాణం చేయొచ్చని వివరించారు. కాగా, పుష్పక్ ఏసీ జనరల్ మంత్లీ బస్సు పాస్ రూ.ఐదువేలు, గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ మంత్లీ బస్సు పాస్ రూ.1900, మెట్రో ఎక్స్‌ప్రెస్ మంత్లీ బస్సు పాస్ రూ.1300 ఉంటుందన్నారు. గ్రేటర్‌లో అన్ని బస్సు పాస్ కేంద్రాల్లో ఉదయం 6:30 నుంచి రాత్రి 8:15 గంటల వరకు జారీ చేస్తారన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నం. 80082 04216లో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమీ లేయర్‌ను రద్దు చేయాలి

అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన నేతల ఆందోళన

రవీంద్రభారతి, ఆగస్టు 22: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమీ లేయర్‌ను రద్దు చేయాలని, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తక్షణమే ఉపసంహరించుకోవాలని, వర్గీకరణ అమలును నిలుపుదల చేయాలని గురువారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్, తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వంచిత్, బహుజన్ అఘాడి అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా. వీఎల్ రాజు పాల్గొని పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. వర్గీకరణకు వ్యతిరేకంగా వర్గీకరణ వద్దు రాజ్యాధికారమే ముద్దు అంటూ నినాదాలు చేశారు. వడ్లమూరి కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ, వర్గీకరణను వెంటనే ఉపసంహరించుకోవాలని, వర్గీకరణ కేవలం పార్లమెంట్ ద్వారానే సాధ్యమతుందని, సుప్రీం కోర్టు తీర్పు చెల్లదని, ఈ వర్గీకరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బూర్గుల వెంకటేశ్వర్లు, బాలవంత్, కోతి ఇందిరా, ఎస్.అశోక్, కె.శ్రీనివాసరావు తదితర దళిత పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధరలో మనమే కీలకం

- సమగ్ర సమాచారంతోనే దేశ భవిష్యత్
- కేంద్ర మంత్రిత్వ శాఖ అడ్వైజర్ డా.దేవాజిత్ కౌంద్



సమాచార బ్రోచర్‌ను విడుదల చేస్తున్న అడ్వైజ్ డా.దేవాజిత్ కౌంద్ తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 22: పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించడంలో మనమే కీలకమని, సమాచారం పారదర్శకంగా ఉంటే రైతులకు మరింత సహకరించినవారం అవుతామని, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ముఖ్య ఆర్థిక వ్యవహారాల సలహాదారు డా.దేవాజిత్ కౌంద్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో గురువారం ఏర్పాటు చేసిన, కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ పథకంలో పనిచేస్తున్న అధికారుల అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆయా పంటలకు మద్దతు ధర ప్రకటించడంలో ప్రపంచంలోనే మనదేశం మేటి అని గుర్తు చేశారు. రైతులకు వివిధ పంటలకు కనీస మద్దతు ధర ప్రకటితుంచడంలో రైతుల నుంచి పంటల సాగు ఖర్చు వివరాలు, ఎంత నాణ్యతలతో సేకరిస్తే రైతులకు కనీస మద్దతు ధరలో అంతే మేలు జరుగుతుందన్నారు. క్షేత్ర సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పథకం సలహాదారు డా.ధనుంజయ్ ప్రసాద్ శ్రీవాత్సవ మాట్లాడుతూ, పంట సాగు ఖర్చు వివరాలు ఆ ఏడాది ఖరీఫ్, రబీ వివరాలు సేకరించి కేంద్రానికి పంపిన వాటి నుంచే కేంద్ర విడుదల చేసిన నిధులలలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. దేశంలోని 19 రాష్ట్రాలలో 8100 మంది ఉత్తమ రైతుల వివరాలు సేకరించి, వారు ఆ ఏడాది ఖరీఫ్, రబీలోల పంట సాగు ఖర్చులు, సాగు విధానం, పెట్టుబడులు లాభాలు తదితర వివరాలు సేకరించిందన్నారు. ఈ పథకం ద్వారా దేశంలో 1971 నుంచి ఆయా రాష్ట్రాలలో అనేక మార్పులు తీసుకు వచ్చామన్నారు. ఈ పథకం గౌరవ సంచాలకులు డా.సుహాసిని ఈ పథకం యొక్క వివరాలు, అమలు తీరును చర్చించారు. పీజేటీఎస్ఏయూ రిజిస్ట్రార్ డా.రఘురామిరెడ్డి మాట్లాడుతూ, ఆయా రాష్ట్రాలు ఆర్థికంగా ఎదగాలంటే శాస్త్రీయ, విద్యా, సమాచార సేకరణ రంగాలలో స్పష్టత ఉండాలన్నారు, ప్రాథమికంగా రైతుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో అండగా ఉంటే, అనతి కాలంలోనే తెలంగాణ ఫలితాలే నిదర్శనమని సూచించారు. అనంతరం, జరిగిన సెషన్‌లో ఆయా రాష్ట్రాల ఫలితాలు, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, పంటల వివరాలు తదితర అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. వివరాల ఎజెండా కాపీని విడుదల చేశారు. కార్యక్రమంలో 19 రాష్ట్రాలకు చెందిన దాదాపు 150 మది అధికారులు పాల్గొని, ఆయా రాష్ట్రాల సాగు వివరాలు, ఆర్థిక పరిస్థితులు ఇప్పటికీ ఎక్కువగా సాగుచేసే పంటల వివరాలు తదితర అంశాలపై చర్చించారు.